# న్యాయం విలువ

-ఆవుల ప్రవంతి




**‘ఏమండీ! మహేంద్ర వర్మగారు మా అబ్బాయి విషయం ఏం తేల్చారు?’ అడిగాడు విశ్వనాథం.**

**‘అదే ఆలోచిస్తున్నాను. ఎన్ని విధాల చూచినా అమ్మాయి వాళ్ల తరఫున చాలా బలమైన సాక్ష్యాలున్నాయి. అబ్బాయికి శిక్ష తప్పేట్టు లేదు’ నేలచూపులు చూస్తూ చెప్పాడు లాయర్ మహేంద్ర వర్మ.**

‘అరెరె. మీరే అలాగంటే ఎలాగండీ? సమయానికి ఆ దేవుడు కూడా కాపాడలేడేమో కాని మీరనుకుంటే అదెంత పని! అనుకున్నంతా చేయగల సమర్థులు మీరు. మీకేదో లెక్కా? ఎలాగైనా గట్టెక్కించగల సవ్యసాచి మీరు...’ పొగడసాగాడు విశ్వనాథం.

‘ఆ... పొగడ్తలకేం గానీ ఈ కేసు గెలిచి అబ్బాయికి శిక్ష పడకూడదనే ఆశ మీకుంటే ఫీజుకు మీరు ఏ మాత్రం వెనుకాడకూడదు. ఎందుకంటే అన్ని నిజమైన ఆధారాలను మనం అబద్ధం చేయాలి. అంతేకాదు సాక్షులను కూడా పైకంతోనే కొనాలి... ఏమంటారు?’ కళ్లెగరేశాడు మహేంద్ర వర్మ.

‘తప్పేదేముందీ. నిండా మునిగాక చలి అనుకుంటామా? కానివ్వండి. మీరెలాగంటే అలాగే... ఇంకో ముఖ్య విషయం అమ్మాయి వాళ్లు పెళ్ళి సమయంలో ఇచ్చిన కట్నం కూడా వెనక్కి లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. అది కూడా పోకుండా చూడండి ప్లీజ్’ బతిమలాడినంతగా చెప్పాడు విశ్వనాథం.

‘అవన్నీ నేను చూసుకుంటానుగా. మీరు నిశ్చింతగా వెళ్ళి రండి’ అభయమిచ్చాడు మహేంద్ర వర్మ.

‘మీపై నమ్మకముందీ. కాని అబ్బాయికి శిక్ష మాత్రం...’ అంటూ అర్థోక్తిగా ఆగిపోయాడు విశ్వనాథం.

‘విశ్వనాథం! కాంచనం కర్మ విమోచనమయ్యా. అన్నీ ధనమే చూసుకుంటుంది. బీ బ్రేవ్’ భుజం చరిచి వెళ్ళి రమ్మన్నాడు మహేంద్ర వర్మ.

★ ★ ★

విశ్వనాథం గారి అబ్బాయి కుమార్‌కు విశాలితో సరిగ్గా సంవత్సరం క్రితం వివాహం జరిగింది. కుమార్ అందం, చదువు, సంస్కారం, అణకువ కలవాడు. అందునా తండ్రి తర్వాత బిజినెస్ వ్యవహారాలన్నీ చూసుకొనే ఏకైక వారసుడని పెళ్ళి సమయంలో నాలుగు లక్షల నగదు, ఇరవై తులాల బంగారం కానుకగా ఇచ్చి వివాహం కూడా విశాలి తల్లిదండ్రులే చేసిచ్చారు. పెళ్ళి తర్వాత రోజు నుండే కుమార్ వ్యక్తిత్వం బయటపడసాగింది. వారం తిరక్కుండానే పుట్టింటి నుండి కారు కొనుక్కు రమ్మని వేధించటం ప్రారంభించాడు. దానికి తోడు కుమార్ తల్లి కూడా ‘అవునమ్మా! వాడు బిజినెస్ పనుల మీద అక్కడా ఇక్కడా తిరిగేవాడు. ఆ మాత్రం సొంత కారు లేకపోతే ఏం బావుంటుంది? మీ నాన్నగారిని కారుకు కనీసం ఆరు లక్షలన్నా ఇమ్మను. వెళ్ళి తీసుకురా. లేకపోతే ఇక ఇంట్లో అడుగు పెట్టకు’ అని తెగేసి చెప్పేది.

‘ఇప్పటికే నా పెళ్ళి కోసం దాదాపు ఆరేడు లక్షలు ఖర్చయ్యాయి. ఇంకా కారంటే ఎలాగత్తయ్యా. వాళ్లు మాత్రం ఎలా కొనివ్వగలరు?’ అని ధైర్యం చేసి అనేది కాని ఆ మరుక్షణమే విశాల చెంప ఛెళ్లుమనేది భర్త చేతిలో. అత్త ఆరళ్లు పెడితే కనీసం భర్తకు చెప్పుకుని అతని ప్రేమను, ఆప్యాయతనూ పొందాలని ఎదురుచూసే విశాలికి అక్కడ కూడా నరకమే ఎదురయ్యేది. ఎవ్వరితోనూ ఏమీ చెప్పుకోలేక తనలో తానే కుమిలిపోయేది.

తల్లిదండ్రులకు విషయం తెలిస్తే బాధ పడతారని మరోవైపు అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోయేది. ఆమె కన్నీటికి ఆ ఇంట్లో విలువ లేకుండా పోయింది.

పుట్టింట్లో ఎంతో గారాబంగా పెరిగిన విశాలి అత్తింట్లో ఆరళ్లకు మల్లెపూవులా కందిపోయేది. మనసు ముళ్లకంచెపై చిక్కిన గాలిపంటలా విలవిల్లాడింది. అన్నింటిని కన్నీలో కరిగించి మనసు పొరల్లోకి దిగమింగుకునేది. మానసిక శారీరక హింసలకు అలవాటు పడుతున్న విశాలికి భర్త అడుగుల చప్పుడు యమధర్మరాజు మహిషికం అడుగుల సవ్వడిలా వినిపించి ఉలిక్కిపడేది. అతను త్వరగా ఇంటికి రాకూడదని దేవుణ్ణి మొక్కుకునేది. కంటికి కునుకు, మనిషికి తిండి రెండూ కరువయ్యాయి. ఆమె ఆవేదన అరణ్య రోదనయింది. అలా అనుక్షణం గుండెను గుప్పెట్లో పెట్టుకుని జీవించటం అలవాటై పోయింది విశాలికి. ఇంతలోనే మరో ఘోరమైన నిజం తెలిసింది. భర్త తనను వదిలించుకునే ప్రయత్నం చేయటానికి బలమైన కారణం కుమార్‌కు ఇంతకు ముందే మరో స్త్రీతో సంబంధం ఉండటం. నిజం తెలిసిన విశాలి నిలువెల్లా కంపించి పోయింది. కాళ్ల కింద భూమి భయంతో కదిలిపోయింది. తన చెవులను తానే నమ్మలేక పోయింది. జరుగుతోంది ఏది నిజమో, ఏది కలో కూడా తెలియని స్థితిలో ఉండిపోయింది. విశాలికి నిజం తెలిసిందన్న విషయం తెలుసకున్నప్పటి నుండి కుమార్ మనసులో ఆందోళన మొదలయింది. తన అసలు రంగు అందరికీ తెలిసిపోతుందని భయపడ్డాడు. తన విషయం ఎవరికీ తెలియనివ్వకూడదని విశాలిని బెదిరించాడు. చంపటానికి కూడా వెనుకాడనన్నాడు. ఆ ప్రయత్నమే చేసేసరికి కుమార్ క్రూరత్వం భరించలేక పోయింది విశాలి.

అతని మానవత్వం లేని మనసును భార్యను భార్యగా

ప్రేమించలేని అతడి దుర్మార్గాన్ని క్షమించాలనుకో లేదు. ఆవేశంలో మనిషి విచక్షణను కోల్పోతాడు. ముందు వెనుకా ఆలోచించే ఇంగితం అస్సలుండదు. తన అస్తిత్వాన్ని ప్రతి క్షణం కోల్పోయే కుమార్ తనేం చేస్తున్నాడో తనకే తెలియని స్థితిలో ఏ ఘోరమైనా చేస్తాడని గ్రహించింది విశాలి. మనిషి దేన్నైనా భరించగలడు కాని ప్రాణానికి ముప్పును ముందే పసిగడితే ఏదైనా చేసి తప్పించుకోవాలని ప్రయత్నిస్తాడు.

సరిగ్గా విశాలి విషయంలో కూడా అదే జరిగింది. మౌనంతో భరించి తనకు తాను పరిష్కరించుకునే సమస్య కాదిది. విశాలి లాంటి స్త్రీలు ఎంతోమంది ఉన్నారు. అందరిలా తానూ భరించాలా? అదే నరక కూపంలో తానూ ఓ వెలుగు లేని జ్యోతిలా ఆరిపోవాలా?

ఇన్నాళ్లు భరించిన క్షోభ చాలు! జీవితమంటే కేవలం ఇదే కాదు. బయటి ప్రపంచంలో నేర్చుకోవాల్సిన లోక జ్ఞానం ఎంతో ఉంది. పాతికేళ్లు తల్లిదండ్రులు పెంచి పోషించిన తనువును ఎవడో అనామకుడి చేతిలో అంతం చేసుకోవటమా?

ఇది అన్యాయం. అంతకు మించిన అరాచకం కూడా మరొకటి ఉండదు. అందుకే విశాలి మనిషికి లేని రెక్కలను నిజం చేసుకుని ఎవ్వరితోనూ చెప్పకుండా ఆ యమ ప్రస్థానం నుండి ఎగిరిపోయింది. తన సొంత గూటిని చేరుకుంది.

ఎప్పుడో మది దొంతరల్లో ఇంకిపోయిన కన్నీటి చుక్కలు తనవారి మీద ధారగా వర్షించాయి. సొంత మనుషుల మధ్య అనురాగ ఆప్యాయతలతో తడిసి ముద్దైంది. తల్లి లాలన, తండ్రి ఆదరణ విశాలికి ఎంతో మానసిక ధైర్యాన్నిచ్చాయి. బంధనాలను తెంచుకున్న మనిషి మనసు స్వేచ్ఛా ప్రపంచంలో విహరించింది. తిరిగి ఎన్నాళ్లకో తనదైన ప్రపంచంలో తనివితీరా కునుకు తీసింది.

ఆడపిల్ల ఎలాంటి భర్తనైనా భరించగలదేమో కాని మనసును తనువును పరాయి స్త్రీతో పంచుకునే భర్తను మాత్రం క్షమించలేదు. సహించనూ లేదు. తండ్రిచ్చిన మానసిక స్థైర్యంతో కోర్టులో కేసు వేసింది. కేసు ఎలాగైనా గెలవగలనన్న గట్టి నమ్మకముంది విశాలికి.

తన కోడలు విశాలి ఎలాగైనా కేసు గెలవకూడదనేదే విశ్వనాథం పట్టుదల. విశాలి కేసు గెలిస్తే తన పరువుతో పాటు కొడుకు అసలు రంగు బయటపడి శిక్ష పడవచ్చు. తీరా తీసుకున్న కట్నం కూడా వెనక్కి ఇవ్వాల్సి వస్తే ఎలా...?? అందుకే లాయర్ మహేంద్ర వర్మను ఆశ్రయించాడు.

ఎన్నో క్లిష్టమైన కేసుల్ని తన మేధా సంపత్తితో వాదించి అవలీలగా గెలిచి పేరు ప్రఖ్యాతులు గడించిన క్రిమినల్ లాయర్ మహేంద్ర వర్మ. కాకపోతే డబ్బుకు కక్కుర్తిపడే రకం. విశ్వనాథంలా బాగా డబ్బున్న శాల్తీల వల్లే తానీ రోజు ఈ స్థాయికి చేరుకోగలిగాడు. అన్నీ వున్నా మహేంద్ర వర్మకు ఏదో అసంతృప్తి. గుండెలపై ఏదో భారం. అది తీర్చుకోవాలని ప్రతి నిముషం తాపత్రయపడుతూనే ఉంటాడు. విశ్వనాథం లాంటి కేసులు కనీసం నెలకు నాలుగైదైనా రావాలని దేవుణ్ణి వేడుకుంటుంటాడు.

మహేంద్ర వర్మకు ఉన్న బరువల్లా ఒక్కటే. అదే తనకున్న ఒక్కగానొక్క కూతురు గీతిక. అమ్మాయి పెళ్ళి ఎంతో ఆర్భాటంగా ఔరా! మహేంద్ర వర్మగారి కూతురి పెళ్ళట అనుకునేలా జరిపించాలని ఎంతో ఆరాట పడిపోతుంటాడు. అదే లక్ష్యంతోనే విశ్వనాథం కోడలు విశాలిపై ఎన్నో అపోహలతో అన్నీ తప్పుడు సాక్ష్యాలను సృష్టించి విశాలి కేసు ఓడిపోయేలా తన ప్రతిభ చూపించుకున్నాడు. నిజాన్ని అబద్ధంగా, అవాస్తవాల్ని నిజం చేయగల మ్యాజిక్ ఒక్క లాయర్ల చేతిలోనే ఉంటుంది. అందునా మహేంద్ర వర్మ లాంటి తల పండిన పండితుడికి అవన్నీ వెన్నతో పెట్టిన విద్యే. క్షణాల్లో విశాలిపై విశ్వనాథం విజయం సాధించి విశాలి నలుగురిలోనూ తలదించుకునేలా చేశాడు.

విజయోత్సాహంతో ఉన్న విశ్వనాథం తన ఫీజు విషయంలో బేరమాడడని అదను చూసి కదను తొక్కాడు మహేంద్ర వర్మ.

తనది కాని సొమ్ము లక్షల్లో అప్పనంగా వచ్చి పడితే లాయర్ ఫీజు లెక్క చేస్తాడా? అడిగింది తడవుగా కారును కానుకగా సమర్పించుకున్నాడు విశ్వనాథం - మహేంద్ర వర్మకు.

**భర్తంటే జీవితాంతం నీ తోడు నీడగా నడిపిస్తూ ప్రతీ కష్టంలోనూ సుఖంలోనూ భరించగలిగేవాడే. కానీ కాసుల కోసం కన్యను శ్రీమతిగా మార్చేవాడు మాత్రం కాదమ్మా?! అలాంటి దుర్మార్గుడి చెరలో నీవుండటం నీకు ఏ కోణంలోనూ మంచిది కాదు.**

★ ★ ★

వెంటనే ముహూర్తాలు చూసుకుని గీతిక పెళ్ళి పనులు పురమాయించుకున్నాడు. తన కూతురికి తగిన వరుడిని ఎంచుకున్న వ్యక్తిని ఎనిమిది లక్షల నగదు, రెండు కేజీల బంగారం, అబ్బాయి అమెరికాలో డాక్టర్ కావటంతో అదనంగా విశ్వనాథం ఇచ్చిన కారును కట్నకానుకల కింద వినయంగా ముట్టజెప్పాడు మహేంద్ర వర్మ.

'కట్నం ఇవ్వటం పుచ్చుకోవటం నేరం' అన్న వాక్యాలను కేవలం పుస్తక పుటలకే పరిమితం చేసి చట్టాలను 'లా' పుస్తకాల్లో మూసేసి అంగరంగ వైభవంగా పెళ్ళి జరిపించాడు.

ఎన్నో కలలను కలబోసి, సిరులను కుమ్మరించి నవరత్నాలను తలంబ్రాలుగా కురిపించి పెళ్ళి జరిపించిన గీతిక జీవితం నవకాంతులను వెదజల్లుతూ సాగుతుందని ఊహించిన మహేంద్ర వర్మకు తీరని విఘాతం ఎదురైంది. పెళ్లి జరిగి పసుపు పారాణి ఆరని పాదాలతో మంగళ తోరణాలు దాటి అత్తింట్లో అడుగుపెట్టిన గీతిక ఆరు మాసాలు దాటకుండానే అసువులు బాసింది. ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న కూతురు దూరమైన మహేంద్ర వర్మ నిర్వేదిలా మారిపోయాడు. అచేతనమైన అతని మెదడు కారణాలను విశ్లేషించటం మర్చిపోయి నిశ్చేష్టుడయ్యాడు. బలమైన కారణమేదో ఎంత వద్దనుకున్నా - మహేంద్ర వర్మ చెవిని చేరనే చేరింది. అల్లుడికి అదనంగా మరో పదిహేను లక్షలు కావాలట. సొంతంగా నర్సింగ్ హోం కట్టించాలని అతని ప్లానట. అన్నీ విన్న మహేంద్ర వర్మ నిర్ఘాంతపోయాడు.

మనిషి ఆశకు ఎంతకూ అంతుండదు. ఆశ ఆకాశం కంటే అనంతమైంది. సముద్రం కంటే కూడా లోతైనది. ఆశ తీరిన కొద్దీ జనిస్తుంది. ఆశ అతిగా ఉంటే అది దురాశే అవుతుంది.

అందిన దాంతో తృప్తి పడతాడనుకున్న అల్లుడు అత్యాశతో కూతురిని ఆక్సిడెంట్‌లో చంపేశాడు. కాని దురదృష్టవశాత్తు జరిగిన కారు ప్రమాదంలో గీతిక ప్రాణాలు కోల్పోయిందని కోర్టును నమ్మించాడు. తను కానుకగా ఇచ్చిన కారులోనే గీతిక శవమై రావటం నిజంగా మహేంద్ర వర్మకు ప్రాణాలు పోయినంత పనైంది.

కాని ఏం చేయగలడు? కోర్టు తీర్పును యథాతథంగా స్వీకరించటం తప్ప! తన కూతురి జీవితం బాగుండాలని ఎంతమంది అమ్మాయిల జీవితాలను తను నాశనం చేయలేదూ? ఆ ఉసురు తనకిలా తగిలింది. అందుకే మనిషికి ఇంత స్వార్థం పనికిరాదు. ప్రశాంతత కరువై మనసు ఆందోళనతో నిండిపోయింది మహేంద్రకు. గదిలో ఓ మూలన కూర్చుని పొగిలి పొగిలి ఏడుస్తున్న భార్యను చూసి భారంగా నిట్టూర్చాడు.

తన మెదడును కదిపేస్తున్న బాధా ప్రకంపనలు బయటికి రానీక, ఎవ్వరితోనూ తన అంతర్మథనాన్ని పంచుకోలేక కుమిలి పోతున్నాడు. తన గుండెల్లో జరిగే సంఘర్షణను ఎవరికీ చెప్పి సానుభూతి పొందలేక పోతున్నాడు.

★ ★ ★

అగమ్యగోచరమైన తన ఆలోచనల్లో ఓ కాంతి తార మెరిసింది.

'అమ్మా విశాలి! నేను తెలిసి తెలిసి నీ పట్ల చేసిన అన్యాయం నిజంగా నీవు భరించలేనిది. అందుకు క్షమించమని నేనడగగలనే తప్ప, నీవు ఆ పని చేయలేవు. ఒకవేళ పెద్ద మనసుతో చేసినా న్యాయదేవత కూడా నన్ను క్షమించలేదు. ఇన్నేళ్లు నీవనుభవించిన మానసిక క్షోభ ఎలాంటిదో నాకిప్పుడు అనుభవేద్యమైంది. కాని విశాలి నేను సామాజికంగా నీకు అన్యాయం చేశానేమో గానీ, మానసికంగా వ్యక్తిగతంగా నీకు సరైన న్యాయమే చేశాననిపిస్తుంది.

ఎందుకో తెలుసామ్మా?

భర్తంటే జీవితాంతం నీ తోడు నీడగా నడిపిస్తూ ప్రతీ కష్టంలోనూ సుఖంలోనూ భరించగలిగేవాడే. కానీ కాసుల కోసం కన్యను శ్రీమతిగా మార్చేవాడు మాత్రం కాదమ్మా?! అలాంటి దుర్మార్గుడి చెరలో నీవుండటం నీకు ఏ కోణంలోనూ మంచిది కాదు. స్వశక్తితో నీ కాళ్లపై నీవు నిలబడగలిగే ఆత్మస్థైర్యం ఉన్నదానివని నాకు తెలుసు. మనిషి ప్రయత్నించాలే గాని అందుకోలేని శిఖరాలుండవు. విశాలి నీకు కావల్సిన వైవాహిక జీవితాన్ని నేను తిరిగి తెచ్చివ్వలేను గాని, నీవు విశ్వనాథానికిచ్చిన కట్నం డబ్బు మాత్రం తిరిగి తెచ్చాను. ఇది నీపై జాలితో కాదమ్మా. నీవు నా కూతురి లాంటి దానివేనన్న భావం. అంతే... ఇన్నాళ్లు నీవు పడ్డ బాధ, కన్నకూతుర్ని పోగొట్టుకుని నేను పడే బాధ ఎవ్వరూ తీర్చలేనివి. పంచుకోలేనివి.

విశాలీ! అదంతా మర్చిపోమ్మా. ఈ డబ్బుతో ఏదైనా స్వయం ఉపాధి ప్రారంభించమ్మా. నీలాంటి వారు నీ చుట్టుపక్కలే ఎందరో ఉన్నారు. వెలుగుచూడని దీన గాథల్లో నీవే జ్యోతి వెలిగించు. వారికి ఆదర్శంగా నిలబడు తల్లీ!' అంటూ కన్నీటి చెమ్మతో వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు లాయర్ మహేంద్ర వర్మ.

'నిజానికితను అప్పుడు తప్పు చేసినా ఇప్పుడు నాకు న్యాయమే చేశాడు' అనుకుంది విశాలి బరువైన మనసుతో... వెళ్ళిపోతున్న మహేంద్రవర్మను చూస్తూ.

★